సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 17 । మే । 2024



‘కేటీపీఎస్’ ఐరన్ పైపులు చోరీ

కేటీపీఎస్ యాష్ పాండ్‌లో చోరీకి గురైన ఐరన్ పైపులను పాత ఇనుప కొట్టులో ఎస్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. 8లో



కుల బహిష్కరణ చేస్తే చర్యలు

కుల, గ్రామ బహిష్కరణకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి హెచ్చరించారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం కొంత చల్లగానే ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సుమనోహరం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కోర్టు భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన



ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చిస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: జిల్లా కోర్టు సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసే కోర్టు భవనాల నిర్మాణానికి గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. జిల్లాలో రెండు అదనపు కోర్టులు నిర్మిస్తే ప్రజలకు సత్వర న్యాయపరిష్కారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు గాజుల రామ్మూర్తి, మెండు రాజమల్లు, ఎస్‌డీ.సాధిక్ పాషా, కాంతయ్య, వడ్లకొండ హరిప్రసాద్, మేకల దేవేందర్, ఎస్‌కె.అంకుష్‌పాషా, ఆర్ అండ్‌బీ డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ సురేష్, రామిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన ద్వారకా తిరుమలకు..



కాలినడకన బయలుదేరుతున్న భక్తులు

దమ్మపేట : దమ్మపేట నుంచి పలువురు భక్తులు గురువారం కాలినడకన ద్వారకా తిరుమలకు బయలుదేరారు. స్థానిక మార్కెట్ యార్డు వీధికి చెందిన భక్తులు తొలుత మండల కేంద్రంలోని రామాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత ద్వారకా తిరుమలేశుడి దర్శనానికి పయనమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం తాము కాలినడకన ద్వారకా తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. కాగా, భక్తులకు మార్గమధ్యంలో భోజన సౌకర్యాన్ని యువజన కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి గోపి ఏర్పాటు చేస్తున్నారు.

నేటి నుంచి సినిమా ప్రదర్శనలు నిలిపివేత

కొత్తగూడెంటౌన్: సినిమా థియేటర్లకు ప్రజల నుంచి సరైన ఆదరణ లేనందున రాష్ట్ర ఫిలిం ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నిర్ణయం మేరకు జిల్లాలో శుక్రవారం నుంచి నుంచి 10 రోజులు థియేటర్లలో సినిమా ప్రదర్శనలు నిలిపేస్తున్నట్లు ఫిలిం ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల చంద్రశేఖర రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా బిజీగా ఉండడం, వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున సినిమా హాళ్లకు ఎక్కువగా రావడం లేదని, దీంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యాన జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తలను నియమించింది. ఈమేరకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ గురువారం ప్రకటన జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం నియోజకవర్గానికి గుండాల కృష్ణ, పాలేరుకు తాళ్లూరి జీవన్‌కుమార్, సత్తుపల్లికి ఎం.డీ.ఖమర్, మధిరకు బిచ్చాల తిరుమల రావు, వైరా నియోజకవర్గానికి లకావత్ గిరిబాబు నాయక్‌ను సమన్వయకర్తలుగా నియమించినట్లు తెలిపారు.


హరితహారంపై నిర్ణయం తీసుకోని సర్కారు

- వానాకాలం సమీపిస్తున్నా వెలువడని ప్రకటన
- సకాలంలోనే రుతుపవనాలు వచ్చే అవకాశం
- మొక్కల పెంపకంపై కానరాని సన్నద్ధత

చుంచుపల్లి మండలంలో ఏర్పాటు చేసిన నర్సరీలో హరితహారం మొక్కలు (ఫైల్)



పచ్చదనానికి ప్రణాళికేది?



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ద్వారా పచ్చదనాన్ని పెంచే ప్రయత్నం చేసింది. ప్రతీ వానాకాలం ప్రారంభంలోనే మొక్కలు నాటేలా అన్ని శాఖలను సమాయత్తం చేసేది. అయితే త్వరలో వానాకాలం రాబోతున్నా ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

సర్కారు వైఖరేంటో..?

గతేడాది చివర్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి పాలైంది. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. అయితే గత సర్కారు కొనసాగించిన అనేక పథకాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు లేదా మార్పులు చేస్తోంది. ఈ క్రమంలో హరితహారం కార్యక్రమంపై ప్రభుత్వ విధానమేంటనే అంశంపై అధికార వర్గాల్లో అయోమయం నెలకొంది. ఈ ఏడాది జూలై రెండో వారంలో జిల్లా వ్యాప్తంగా 50 లక్షల మొక్కలు హరితహారం కార్యక్రమం కింద నాటాలని గత ప్రభుత్వ హయాంలోనే నిర్ణయించారు. ఈ మేరకు పనులు జరగాలంటే మే చివరి వారం నాటికి సమీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా గత మార్చి 15 నుంచి జూన్ 2 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఈ నేపథ్యంలో హరితహారం కార్యాచరణ ఎప్పుడు ప్రారంభిస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది.

వాపస్ పోని వానరాలు..

అడవులు దట్టంగా పెంచాలని, ఈ క్రమంలో పండ్ల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని హరితహారం కార్యక్రమం ఆరంభంలో నిర్ణయించారు. కానీ అనూహ్యంగా పండ్ల మొక్కల అంశం పక్కకు జరిగి సీడ్‌బాల్స్, పల్లె, పట్టణ ప్రకృతి వనాలు, చిట్టడవులు, అర్బన్ ఫారెస్ట్రేషన్ అంశాలు తెరపైకి వచ్చాయి. మంకీ ఫుడ్ కోర్టులు నామ్ కే వాస్తేగా ఏర్పాటు చేశారు. దీంతో హరితహారం ప్రారంభించి తొమ్మిదేళ్లయినా గ్రామాల్లో కోతుల బెడద తగ్గలేదు. వానరాలు అడవుల్లోకి వాపస్ పోలేదు. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల మాట్లాడుతూ.. హరితహారం తరహాలో జిల్లాలో భారీ ఎత్తున పామాయిల్ తోటల సాగును ప్రోత్సహిస్తామని, తద్వార జిల్లాకు పచ్చదనం అద్దుతామని చెప్పారు. హరితహారం కార్యక్రమం అమలైతే.. విజయవంతం చేయడంలో అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్, వ్యవసాయ శాఖలు కీలకం. ఇంతవరకు ఆయా శాఖలకు ఎలాంటి సమచారం అందకపోవడంతో ఈ సీజన్‌లో చేపట్టబోయే హరితహారం కార్యక్రమం ఎలా ఉండబోతోందనే అంశం ఆసక్తికరంగా మారింది.

రూపురేఖలు కోల్పోయిన ప్రకృతివనాలు..

జిల్లా వ్యాప్తంగా 481 పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో విరివిగా పల్లె, పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. అయితే నిధుల సమస్య కారణంగా గత కొన్నేళ్లుగా పలుచోట్ల పల్లె, పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో అవి రూపురేఖలు కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి వనాల నిర్వహణ అంశం కీలకం కానుంది.

తొమ్మిదేళ్ల క్రితం ప్రారంభం..

‘వనాలు పెరగాలి.. వానలు వాపస్ రావాలి.. కోతులు వాపస్ పోవాలి’ అనే నినాదంతో 2015 జూలై 15న హరిత హారం కార్యక్రమాన్ని అప్పటి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో 23 శాతం అడవులు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది వానాకాలం ఆరంభంలో అటవీశాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని విరివిగా చేపట్టడం ఆనవాయితీగా వచ్చింది. ఈ మేరకు మే లోనే మండలాలు, గ్రామాల వారీగా ఎన్ని మొక్కలు నాటాలి.. ఎక్కడ నాటాలి.. వాటి సంరక్షణ ఎలా.. తదితర అంశాలపై సమీక్షలు నిర్వహించేవారు. అందులోనే హరితహారం లక్ష్యం, కార్యాచరణ సిద్ధమయ్యేవి. కానీ ప్రస్తుతం ఆ హడావిడి ఎక్కడా కనిపించడం లేదు.

రైతులకు ఇబ్బంది రానీయొద్దు

స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ కంచర్ల



మాట్లాడుతున్న చైర్మన్ కంచర్ల, హాజరైన జెడ్పీటీసీలు, అధికారులు

చుంచుపల్లి: వచ్చే వ్యవసాయ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువుల విషయంలో ఇబ్బంది రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు అధికారులను ఆదేశించారు. గురువారం జెడ్పీ హాల్‌లో ఏర్పాటు చేసిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ వ్యవసాయ సీజన్‌లో రైతులు నకిలీ విత్తనాలు, ఎరువులతో తీవ్రంగా నష్టపోతున్నారని, వీటి నివారణకు అధికారులు ముందే అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. నకిలీ విత్తన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈసారి రుతుపవనాలు ముందుగానే వస్తాయనే సమాచారం ఉన్నందున పంటల సాగుపై క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు అందించాలన్నారు. వివిధ శాఖల ద్వారా పేదలకు అందుతున్న ప్రభుత్వ పథకాలను నూరు శాతం అమలు చేయాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సవరించాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్ల పునఃప్రారంభానికి ముందే వసతులు, మరమ్మతులపై దృష్టి సారించాలన్నారు. గతంలో చేపట్టిన పనులకు సక్రమంగా నిధులు రావడం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తేగా.. కారణాలేంటని సంబంధిత అధికారులను చైర్మన్ ప్రశ్నించారు. పోడు సాగుదారుల విషయంలో ప్రభుత్వం సానుకులంగా ఉందని, అటవీ అధికారులు పోడు రైతుల జోలికి వెళ్లొద్దని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అప్పుడే వారి మన్ననలు పొందుతారని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు. అధికారులంతా సమన్వయంగా వ్యవహరిస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు ముందుకొచ్చిందని, వాటిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీలు బరపటి వాసుదేవరావు, వెంకటరెడ్డి, రామక్క, మేరెడ్డి వసంత, వెంకటేశ్వరరావు, కొమరం హనుమంతరావు, జెడ్పీ సీఈఓ ప్రసూనారాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు @ 4,87,312 ఎకరాలు

వానాకాలం సాధారణ విస్తీర్ణం ఖరారు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం సీజన్ పంటల సాధారణ విస్తీర్ణాన్ని వ్యవసాయ శాఖ ఖరారు చేసింది. గత సంవత్సరం వానాకాలంలో 4,59,793 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, ఈ ఏడాది 4,87,312 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వరి, కంది, మొక్కజొన్న, పెసర, జొన్న, నువ్వుల పంటలు గతేడాది కంటే ఈ సీజన్‌లో అధికంగా పండిస్తారని అంటున్నారు. ఈ పంటలు కాకుండా జనుము, జీలుగ, పిల్లిపెసర పంటలు కూడా గత వానాకాలం సీజన్ కంటే ఈ ఏడాది పెరగవచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. జీలుగ గత సంవత్సరం 34,866 ఎకరాల్లో పండించగా ఈ సంవత్సరం 51,498 ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని, జనుము గత సీజన్‌లో 2,638 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 4,363 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని, పిల్లిపెసర 1,530 ఎకరాల్లో మాత్రమే సాగు చేయగా ఈ ఏడాది గణనీయంగా పెరిగి 12,512 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఈ మూడు పంటల విస్తీర్ణం గత సీజన్‌లో 39,034 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 68,373 ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ సాధారణ అంచనా.

గతేడాది సాగు చేసిన, ఈ వానాకాలంలో వ్యవసాయ శాఖ అంచనా వేసిన విస్తీర్ణం వివరాలిలా.. (ఎకరాల్లో)

పంట	2023	2024
వరి	1,61,157	1,65,854
కంది	3,046	8,348
మొక్కజొన్న	59,185	60,200
మిర్చి	29,694	32,168
పెసర	141	288
మినుము	995	874
జొన్న	2	45
వేరుశనగ	3,296	2,359
నువ్వులు	15	551
పత్తి	2,02,262	2,16,625
మొత్తం	4,59,793	4,87,312

ఏసీబీకి చిక్కిన ట్రాన్స్‌కో ఏఈఈ

రైతు నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి



పట్టుబడిన ట్రాన్స్‌కో ఏఈఈతో ఏసీబీ డీఎస్పీ రమేష్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: ఓ రైతు నుంచి ట్రాన్స్‌కో ఏఈఈ(ఆపరేషన్స్) రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన అశ్వారావుపేటలో గురువారం చోటుచేసుకుంది. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన రైతు కొనకళ్ల జనార్దన్‌రావుకు అశ్వారావుపేట మండలం మద్దికొండ(భీమునిగూడెం) సమీపంలో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు రైతు కుమారుడు ఆదిత్య నెల రోజుల క్రితం మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేశాడు. ఆ తర్వాత ట్రాన్స్‌కో ఏఈఈ(ఆపరేషన్స్) శరత్‌కుమార్‌ను కలిసి ఈ విషయం చెప్పగా రూ.1.81 లక్షలుగా అంచనా వేసి, డీడీ రూపంలో చెల్లించాలని సూచించారు. ఆయన సూచన మేరకు ఆదిత్య డీడీ అందజేశాడు. అయితే డీడీతో పాటు అదనంగా మరో రూ.లక్ష ఇవ్వాలని ఏఈఈ డిమాండ్ చేయగా, ఆదిత్య ఖమ్మం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ రమేష్ బృందం రంగంలోకి దిగి.. బాధితుడి నుంచి స్థానిక శ్రీ లక్ష్మీ తులసీ అగ్రో పేపర్ బోర్డు వద్ద ఏఈఈ శరత్‌కుమార్ రూ.లక్ష లంచం తీసుకుంటుడగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసి, పంచనామా చేశారు. ఏఈఈపై కేసు నమోదు చేసి ఖమ్మం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌లు ఎస్. శేఖర్, డి.సునీల్, మహేష్, హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య, సిబ్బంది శ్రీను, శ్రీనివాసాచారి, రంగా పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై దృష్టి

ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న జీఎం సుధాకర్‌రెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగు విస్తరణపై దృష్టి సారించాలని, ఈ ఏడాది లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి సూచించారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెంలోని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో క్షేత్ర స్థాయి ఉద్యోగులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగులకు కేటాయించిన ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేసి, రబీ లక్ష్యానికి సంబంధించినన ప్రణాళికలు సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 17,500 ఎకరాలు, రబీకి 8,500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను విస్తరించాలన్నారు. సాగు విస్తరణకు సరిపడా ఆయిల్‌పామ్ మొక్కలు ఆయిల్‌ఫెడ్ నర్సరీల్లో సిద్ధంగా ఉన్న విషయాన్ని రైతులకు వివరించాలని చెప్పారు. అనంతరం జీఎం విలేకరులతో మాట్లాడుతూ పంట సాగు విస్తరణపై దృష్టి సారించామని, ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఇప్పటికే అనువైన వ్యవసాయ భూములను గుర్తించగా, రైతులకు సబ్సిడీపై మొక్కలు అందిస్తామన్నారు. అలాగే పోడు పట్టాలు అందుకున్న గిరిజన రైతులకు కూడా ఆయిల్‌పామ్ సబ్సిడీ పథకాలను వర్తింపజేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, తోటలకు అవసరమైన బోరాన్ ఎరువులు రైతులకు త్వరలోనే అందిస్తారని జీఎం తెలిపారు. ఆతర్వాత జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో విస్తరణ పనులను పరిశీలించడమే కాక గెలల క్రషింగ్‌పై ఆరా తీశారు. ఈ సమావేశాల్లో డీఓ ఆకుల బాలకృష్ణ, వివిధ విభాగాలు, ఫ్యాక్టరీల మేనేజర్లు భారతి, శ్రీకాంత్ రెడ్డి, జె.సత్యనారాయణ, బాలకృష్ణ, కల్యాణ్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో మరమ్మతులు చేయండి

- ఆశ్రమ పాఠశాలలను సొంతింటిలా చూసుకోవాలి
- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



ఉప్పసాక ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న పీఓ

బూర్గంపాడు/పాల్వంచ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో అవసరమైన మరమ్మతు పనులు ఈనెల 20 లోగా పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశించారు. బూర్గంపాడు మండలం ఉప్పుసాక, పాల్వంచ మండలం కిన్నెరసాని గిరిజన ఆశ్రమ పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలను సొంత ఇల్లులా భావించాలని, ఇంటిని ఎలా శుభ్రం చేస్తామో పాఠశాలలను కూడా అలాగే ఉంచాలని అన్నారు. మరమ్మతు పనుల పురోగతికి సంబంధించిన ఫొటోలను తనకు పంపించాలన్నారు. డార్మెటరీలకు తప్పకుండా మెష్ డోర్లు ఏర్పాటు చేయాలని, గోడల పగుళ్లకు ప్యాచ్‌వర్క్ చేయించాలని, తలుపులు, కిటికీల మరమ్మతులు వెంటనూ పూర్తి చేయాలని ఆదేశించారు. తరగతి గదులు, డార్మెటరీలు, బాత్‌రూమ్‌లను ఫినాయిల్‌తో శుభ్రం చేయించాలన్నారు. విద్యార్థులందరికీ బెడ్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతీ మూడు బెడ్లకు ఒక ఫ్యాన్ ఏర్పాటు చేయాలని, హాస్టళ్లు, స్కూళ్లలో పనికిరాని వస్తువులను అమ్మేసి, ఆ డబ్బును మరమ్మతులకు వినియోగించాలని చెప్పారు. పాఠశాల ఆవరణలో ఆహ్లాదం కలిగించేలా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. విద్యార్థులకు గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ మణెమ్మ, హెచ్‌ఎంలు అజ్మీరా కృష్ణ, చందు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి..



కిన్నెరసాని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పీఓ ప్రతీక్ జైన్ ఆకాంక్షించారు. కిన్నెరసాని క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పరిచేయం చేసుకున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రీడల అధికారి బొల్లి గోపాలరావు, కొమరం వెంకట నారాయణ, ఏఎస్‌ఓ క్యాంప్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, క్రీడా శిక్షకులు పదం రాంబాబు, జె.నాగరాజు, గొంది మారప్ప, దివ్య బాపనమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

మణుగూరు రూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ ఒక ప్రకటనలో సూచించారు. 2024–25 విద్యాసంవత్సరానికి ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోపా)ల్లో ప్రవేశాల కోసం జూన్ 10వ తేదీలోగా అన్ని ధ్రువపత్రాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 1 ఆగస్టు 2024 నాటికి 14 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన కోసం సమీప ఐటీఐ కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకోవాలని సూచించారు. పూర్తి వివరాలను iti. telangana. govt. in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



దీజీఎం రమేష్‌తో సంఘం నాయకులు

మణుగూరు టౌన్: సింగరేణి సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు కోరారు. ఈసందర్భంగా గురువారం మణుగూరు ఏరియా డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమ సంఘం క్వార్టర్ల మార్పు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ తదితర సమస్యలన వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొనగంటి అంకుష్, జమ్మిడి మల్లేష్, శనిగరపు కుమారస్వామి, కాజీపేట కృష్ణ, నాగరాజు, ప్రమోద్, అశోక్, శ్రీనివాస్, సారధి బాబు, జనార్దన్ తదితరులు ఉన్నారు.

కేటీపీఎస్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటుకు నోటిఫికేషన్

పాల్వంచ : కేటీపీఎస్ ఏడో దశ, ఓఅండ్ఎం కర్మాగారానికి చెందిన స్పోర్ట్స్ కౌన్సిల్ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. గతంలో పనిచేసిన స్పోర్ట్స్ సెక్రటరీ ఉద్యోగ విరమణ పొందడంతో పాటు ఏఈ కేడర్‌కు చెందిన ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీగా ఉన్న వ్యక్తిని ఏకపక్షంగా స్పోర్ట్స్ సెక్రటరీగా నియమించారు. ఈ విషయంపై కాంప్లెక్స్‌లో దుమారం చెలరేగింది. ఈ నియామకం చెల్లదని పలువురు కార్మిక, సామాజిక వర్గాల నాయకులు సీఎండీకి లేఖలు రాశారు. ఈ క్రమంలో గురువారం మరో నోటిఫికేషన్ విడుదల చేశారు. స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడిగా కేటీపీఎస్ సీఈ, ప్రధాన కార్యదర్శి గా సివిల్ ఎస్ఈ లేదా క్రీడలపై ఆసక్తి ఉన్న ఎస్ఈ ఎవరైనా ఉండాలని, సెక్రటరీగా ఏడీఈ కేడర్ క్రీడాకారుడు, కోశాధికారిగా జేఏవో, ఇండోర్ గేమ్స్ సెక్రటరీగా ఏదేని క్రీడాకారుడు, సాంస్కృతిక కార్యదర్శిగా కళాకారుడు లేదా క్రీడాకారుడు, మహిళా ప్రతినిధులుగా మహిళా క్రీడాకారులు, కార్యవర్గ సభ్యులుగా పది మంది క్రీడాకారులు ఉండాలని, దీనిని పరిగణనలోకి తీసుకుని మాత్రమే కౌన్సిల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

డీసీసీబీ బదిలీల్లో వివాదం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) పరిధిలో జరిగిన అధికారుల, ఉద్యోగుల బదిలీల వ్యవహారం వివాదానికి దారితీసింది. డీసీసీబీ బ్రాంచ్‌ల్లో మూడేళ్ల సర్వీస్ నిండిన 92 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 30 మంది మేనేజర్లను బదిలీ చేస్తూ సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సీఈఓ నడుమ తేడా రావడంతో సీఈఓను గురువారం చైర్మన్ ప్రశ్నించారు. అయితే, నిబంధనల మేరకు బదిలీ చేశామని సీఈఓ బదులివ్వగా, ఇరువురి మధ్య వివాదం పెరిగిందని సమాచారం. కాగా, బదిలీ అయిన వారు పలువురు నూతన స్థానాల్లో చేరగా, ఇంకొందరు తాము కోరుకున్న స్థానాలు కాకపోవడంతో వెనుకాడుతున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా బదిలీల వ్యవహారం డీసీసీబీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రూ.10లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తరలిస్తున్న రూ.10లక్షల విలువైన గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పక్కాగా అందిన సమాచారంతో పోలీసులు రైలులో తనిఖీలు చేస్తుండగా రెండు సూట్ కేసుల్లో తీసుకెళ్తున్న 26 కేజీల గంజాయిని గుర్తించారు. అయితే, గంజాయి తరలిస్తున్న వారు తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. కాగా, జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల కాలంలో సుమారు 300కేజీల గంజాయిని ఇటీవల స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. తనిఖీల్లో పాల్గొన్న సీఐ సీహెచ్.శ్రీనివాస్, సిబ్బంది సుధీర్, హరీష్, వెంకటేశంను డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ గణేష్ అభినందించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.14,229

‘కేటీపీఎస్’ ఐరన్ పైపులు చోరీ

- స్క్రాప్ దుకాణంలో స్వాధీనం చేసుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది
- కేసు నమోదుపై తాత్సారం చేస్తున్న పోలీసులు

పాల్వంచ: కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి విలువైన ఐరన్ పైపులు చోరీకి గురయ్యాయి. ఆ పైపులను గురువారం పట్టణంలోని ఓ పాత ఇనుప కొట్టులో ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి ఐరన్ పైపులు చోరీకి గురైనట్లు ఎస్పీఎఫ్ అధికారులు గుర్తించారు. ఆరా తీయగా అవి పాత ఇనుప కొట్టు(స్క్రాప్)నకు తరలినట్లు సమాచారం అందింది. దీంతో ఎస్పీఎఫ్ ఆర్ఐ కరుణాకర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన సిబ్బంది దమ్మపేట సెంటర్‌లోని సాయిరాం పాత ఇనుప కొట్టులో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పైపులతోపాటు నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు, 2 ఎల్పీజీ సిలిండర్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసి స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఉదయం పట్టుకున్న ఐరన్ పైపులను పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకుని, సాయంత్రం వరకు



స్క్రాప్ షాపులో ఎస్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్న కేటీపీఎస్ ఐరన్ పైపులు

కేసు నమోదు చేయలేదు. పాల్వంచ రూరల్ ఠాణా పరిధిలోకి వస్తుందని దాటవేశారు. కాగా పట్టణంలో పట్టుబడిన పైపులపై ఎస్పీఎఫ్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదును సైతం వెనక్కి పంపించారు. యాష్ పాండ్ రూరల్ పరిధిలో ఉందంటూ పట్టణ పోలీసులు పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా రూరల్ పోలీసులు కూడా ఫిర్యాదు అందిందని ఒకసారి, ఫిర్యాదు రాలేదని మరోసారి చెప్పడం గమనార్హం. పట్టుబడిన పైపుల విలువ రూ.2.50 లక్షల వరకు ఉంటుంది. ఈ విషయమై ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీని వివరణ కోరగా.. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి పంపించారని తెలిపారు. టౌన్ ఎస్ఐ రామును వివరణ కోరగా.. రూరల్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని తెలిపారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా... ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు. తరచూ రాత్రి వేళల్లో విలువైన ఐరన్ పైపులను కట్ చేసి పాత ఇనుప షాపులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినా అధికారలు మేల్కొనకపోగా, దొంగలకే వత్తాసు పలుకుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా పైపుల చోరీలపై వచ్చిన ఫిర్యాదులను సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా సంబంధిత జెన్‌కో అధికారులు ఈ విషయంలో ఫిర్యాదు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి విలువైన సొమ్మును రక్షించాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యేలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు పాయం, తెల్లం, పక్కన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మణుగూరు టౌన్/భద్రాచలంటౌన్: నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కోరారు. గురువారం వారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో వెళ్లి హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎన్నికల ప్రచార సరళి, ఓటింగ్ నమోదు, గెలుపు అవకాశాలు తదితర విషయాలను సీఎంకు వివరించారు. అనంతరం నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యాచరణపై చర్చించారు. భద్రాచలంలో మహిళా జూనియర్ కళాశాల, చర్ల మండలంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, భద్రాచలం కరకట్ట నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, తాలిపేరు, పాలెంవాగు, గుండ్లవాగు తదితర చిన్న తరహా ప్రాజెక్టుల ఆధునికీకరణ చేపట్టాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని సీఎంకు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తామని, భద్రాచలం పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ పేదలకు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

మణుగూరు టౌన్: మణుగూరు 100 పడకల ఆస్పత్రిని గురువారం డీసీహెచ్‌ఎస్ రవిబాబు సందర్శించి విచారణ చేపట్టారు. దాతలు వితరణ చేసిన సామగ్రి దొంగల పాలవుతున్న తీరుపై ‘ప్రభుత్వాస్పత్రిలో ఇంటి దొంగలు’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన డీసీహెచ్‌ఎస్ ఆస్పత్రిని సందర్శించి విచారణ చేశారు. ఆస్పత్రిలో ఉన్న సామగ్రి వివరాలు పూర్తి స్థాయిలో రికార్డుల్లో లేనట్లు గుర్తించినట్లు తెలిసింది. వివిధ కారణాలతో సూపరింటెండెంట్‌లు మారుతుండటంతో పర్యవేక్షణ కొరవడి మంచాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినట్లు తెలిసింది. కాగా కొన్ని మణుగూరు ప్రభుత్వ వైద్యాధికారి జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చి పాత ఇనుప దుకాణాలకు విక్రయించి ఆ డబ్బును ఆస్పత్రి ఖాతాకు జమ చేసినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. కిందిస్థాయి సిబ్బందితో మాట్లాడి పలువురికి హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. దాతలు అందించిన ఏసీ రికార్డు కాకపోవడంతోపాటు కుర్చీలు అందుబాటులో లేకపోవడంతో వెంటనే ఆ



100 పడకల ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీసీహెచ్‌ఎస్ రవిబాబు

వివరాలతోపాటు ఆస్పత్రి సామగ్రి పూర్తి వివరాలు నివేదిక అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయమై డీసీహెచ్ ఎస్ రవిబాబును వివరణ కోరగా.. సిబ్బంది లేమితో 2021–22 సంవత్సరంలో దాతలు అందించిన మూడు ఏసీల్లో ఒకటి లేనట్లు గుర్తించామని తెలిపారు. రికార్డు చేయని కుర్చీలు కొన్ని లేవని గుర్తించామని, వాటి లెక్కలు తీయిస్తామని చెప్పారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలు సేకరించి, చోరీకి గురైనట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, విధుల నుంచి తొలగిస్తామని వివరించారు.

పాలకుల విప్లవ ప్రతిఘాతక దాడిని ఓడిద్దాం

మావోయిస్టు పార్టీ నేత ఆజాద్

చర్ల: భారత విప్లవోద్యమ నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతక దాడిని ఓడించడంతో పాటు మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపుతున్న పాలకుల తీరును ఖండించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరిట గురువారం లేఖ విడుదల చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ దాడుల్లో భాగంగానే గ్రామాలపై దాడులు చేస్తూ అత్యాచారాలకు పాల్పడడమే కాక మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను చంపి ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ నిర్మూలన పేరుతో గత మూడున్నర నెలల కాలంలో 108 మందిని పొట్టనబెట్టుకోగా అందులో 60 మంది ఆదివాసీ మహిళలు, వృద్ధులు, పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. 2024 నాటికల్లా మావోయిస్టు పార్టీని మట్టుబెడతామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన తర్వాత ఈ దాడులు పెరిగాయని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాలు.. ఆపై దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించడం కోసమే ఈ దాడుల పరంపర కొనసాగుతోందని ఆరోపించారు. ఆదివాసీ త్యాగాలతో రక్తసిక్తమవుతున్న అడవుల్లో ప్రభుత్వాలు రహదారులు వేసి అడవులను ఖాకీమయం చేయడం ద్వారా అపారమైన ప్రకృతి వనరులను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి చర్యలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాల నేతలు ఖండించాలని ఆజాద్ ఆ లేఖలో కోరారు.

చోరీ సొమ్ము రికవరీ

దమ్మపేట: చోరీకి గురైన బంగారు నగలను పోలీసులు గురువారం రికవరీ చేశారు. ఈ నెల 10న దమ్మపేటలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో మహ్మద్ అన్మీలా వివాహ వేడుకలు జరగగా, ఆ వేడుకల్లో ఆమెకు సంబంధించిన 50 గ్రాముల బంగారు నగలు అపహరణకు గురైన విషయం విదితమే. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేడుకల్లో సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన ఓ మహిళ బ్యూటీషియన్‌గా పని చేసేందుకు వచ్చి నగలను చోరీ చేసినట్లు విచారణలో తేలింది. దీంతో ఆమె నుంచి నగలను రికవరీ చేశామని ఎస్సై ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.


విద్యుదాఘాతంతో మహిళ మృతి

దుమ్ముగూడెం : మండలంలోని లచ్చిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టం వెంకటమ్మ(55) గురువారం సాయంత్రం సమయం వర్షం వస్తుండగా మేకలు బయటకు పరుగుతీసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఆగాయి. దీంతో మేకలను తోలుకొచ్చేందుకు ఆమె ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లగా, విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు గమనించి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు.

■ విరబూసిన ‘మే’ పుష్పం

మండు వేసవి కాలంలో మాత్రమే పూసే ‘మే’ పుష్పం గురువారం వికసించింది. అశ్వారావుపేట మండల కేంద్రంలోని వెలమ బజార్‌కు చెందిన సోమాని రాజా రమేష్ ఇంటి ఆవరణలో ఈ మొక్కలు ఉన్నాయి. ప్రతి యేట వేసవిలో మాత్రమే పూయడం ఈ మొక్క ప్రత్యేకత. అలాగే ఒక మొక్కకు ఒక పువ్వు మాత్రమే పూస్తుంది. కాగా ఈ పుష్పాన్ని చుట్టు పక్కల వారంతా ఆసక్తిగా వీక్షిస్తున్నారు.

– అశ్వారావుపేటరూరల్



11 డయేరియా కేసులు నమోదు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో 11 డయేరియా కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పరిధిలో ఉన్న రెండు గ్రామాలు కుడుములతోగు, కొత్తూరుకు చెందిన ప్రజలు కలుషిత నీటిని తాగి వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చికిత్స పొందారు. మెరుగైన చికిత్స కోసం 11 మంది భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేరారు. వీరిలో ఏడుగురు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. వీరిలో ఒక బాలింత ఉండగా, ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.



చికిత్స పొందుతున్న చిన్నారులు

బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయం వద్ద గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాప్యం చేయకుండా రైతులకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకుడు వనమా రాఘవేంద్రరావు, వైస్ చైర్మన్ దామోదర్, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోన, లక్ష్మీదేవిపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, ఉర్దూఘర్ మాజీ చైర్మన్ అన్వర్‌పాషా, బొమ్మిడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పేకాటరాయుళ్ల అరెస్ట్

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండల పరిధిలోని పెనగడప గ్రామ పంచాయతీ చంద్రుకుంట గ్రామ శివారులో పేకాట స్థావరంపై గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారయ్యారు. రూ.10 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తగూడెం టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ తెలిపారు.

నేత్రదానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దొరై కుప్పుస్వామి (54) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం కుటుంబ సభ్యులు ఆయన కళ్లను ప్రభుత్వ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.



కుప్పుస్వామి (ఫైల్)

కుల బహిష్కరణకు పాల్పడితే కఠిన చర్యలు

వడ్డెర రంగాపురంవాసులకు సీఐ కౌన్సెలింగ్

అశ్వారావుపేటరూరల్: కుల, గ్రామ బహిష్కరణ ఘటనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని అశ్వారావుపేట సీఐ జితేందర్ రెడ్డి హెచ్చరించారు. అశ్వారావుపేట మండలం వడ్డెర రంగాపురం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట వేడుకకు 20 కుటుంబాలు చందా ఇవ్వలేదని కుల బహిష్కరణ చేసిన ఘటనపై బుధవారం బాధిత కుటుంబాలు పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై గురువారం సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో వడ్డెర రంగాపురం గ్రామంలో విచారణ చేపట్టారు. వివరాలు తెలుసుకుని గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కుల మతాల పేరుతో బహిష్కరించడం, కించపరచడం వంటి ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ జితేందర్ రెడ్డి

రెండు లారీలు ఢీ

కేబిన్‌లో ఇరుక్కుని గాయపడిన ఓ డ్రైవర్

పాల్వంచ/సింగరేణి(కొత్తగూడెం): రెండు లారీలు ఢీకొని ఓ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ధాన్యం లోడ్‌తో వెళుతున్న లారీ బ్రేక్ డౌన్ కావడంతో నవభారత్ కర్మాగారం ముందు మలుపు వద్ద ఆగిపోయింది. రాత్రి 11 గంటల సమయంలో జగ్గయ్యపేట నుంచి మల్కన్‌గిరికి సిమెంట్ లోడ్‌తో వెళుతున్న లారీ.. ఆగి ఉన్న ధాన్యం లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో సిమెంట్ లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. మహబూబాబాద్ జిల్లా అనంతారానికి చెందిన, డ్రైవర్ రాము కేబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ బి.రాము సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డ్రైవర్ కేబిన్‌లో చిక్కుకుని ఆర్తనాదాలు చేస్తుండగా సింగరేణి రెస్క్యూ విభాగానికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రమాదా స్థలికి వచ్చిన రెస్క్యూ టీమ్ సుమారు మూడు గంటలపాటు శ్రమించి హైడ్రాలిక్ కటింగ్ బ్లేడ్ సహాయంతో కేబిన్ షెట్టర్స్ కట్ చేశారు. కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను సురక్షితంగా బయటికి తీసి, ఆస్పత్రికి తరలించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బంది జోసఫ్ కిషోర్, హరాలాల్, సాయి సందీప్, నాగేశ్వరరావులను పోలీసులు, సింగరేణి జీఎం శాలెంరాజు తదితరులు అభినందించారు.



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నకుమారిని ఉన్నతాధికారులు గురువారం సస్పెండ్ చేశారు. కాగా సస్పెన్షన్‌కు కారణాలు తెలియాల్సి ఉంది.

అత్యాచారయత్నం, అట్రాసిటీ కేసు నమోదు

సుజాతనగర్: ఓ యువతిపై అత్యాచారానికి యత్నించి, కులం పేరుతో తిడుతూ దాడికి పాల్పడిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ యువతిని ఈ నెల 12వ తేదీన రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బలాత్కరించబోయాడు. యువతి కేకలు వేయగా, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానంటూ బెదిరించి అక్కడినుంచి పారిపోయాడు. ఈ నెల 14న మధ్యాహ్న సమయంలో సదరు వ్యక్తితో పాటు, అతని భార్య, అన్న, తల్లి నలుగురు కలిసి యువతి కుటుంబ సభ్యులను బెదిరించి కులం పేరుతో దూషించారు. యువతిపై దాడికి పాల్పడ్డారు. జరుగుతున్న గొడవను ఆపేందుకు గ్రామస్తులు ప్రయత్నించగా వారిని సైతం కులంపేరుతో దూషించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై జుబేదా బేగం తెలిపారు.

ప్రమాద ఘటనలో కేసు...

పాల్వంచ: బాలుడిని మోటార్‌సైకిల్‌తో ఢీ కొట్టిన వ్యక్తిపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గత ఏప్రిల్ 18న మండలంలోని రంగాపురంలో కిరాణా షాపునకు వెళుతున్న బాలుడు మాలోతు సిద్ధును బూర్గంపాడుకు చెందిన రాకేశ్ తన మోటర్ సైకిల్‌తో ఢీకొట్టాడు. దీంతో బాలుడికి కాలు విరిగింది. చికిత్స పొంది వచ్చిన అనంతరం గురువారం బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై..

పాల్వంచ: క్రికెట్ బెట్టింగ్ కట్టలేదనే నెపంతో గొడవ పడి దాడి చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణ పరిధిలోని బంగారుజాల గ్రామానికి చెందిన సున్నం పెద్దిరాజు గ్రామ శివారులో ఈ నెల 15న క్రికెట్ ఆడుతుండటంతో చూడటానికి వెళ్లాడు. దీంతో అక్కడ సున్నం రామకృష్ణ క్రికెట్ బెట్టింగ్ కోరగా నిరాకరించడంతో గొడవకు దిగి కర్రతో దాడికి పాల్పడ్డాడు. దీంతో పెద్దిరాజు తలకు గాయం కావడంతో తోటి వారు ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ బి.రాము తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలో చోరీ

ఇల్లెందు: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఫైళ్లు, ప్రింటర్, కంప్యూటర్ చోరీకి గురయ్యాయి. వేసవి సెలవుల్లో పాఠశాలలోని సామగ్రి అపహరించారని కరస్పాండెంట్ వెంకటస్వామి ఫిర్యాదు చేయగా, సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

పశువులు పట్టివేత

భద్రాచలంఅర్బన్: దుమ్ముగూడెం మండలం చిన్ననల్లబల్లి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరువూరుకు తరలిస్తున్న పశువులను గురువారం భద్రాచలం బ్రిడ్జి సెంటర్‌లో పోలీసులు పట్టుకున్నారు. ట్రాలీ ఆటోలో తరలిస్తున్న ఎనిమిది పశువులను పట్టుకుని పాల్వంచలోని గోశాలకు తరలించారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ తోట దగ్ధం

కరకగూడెం: పామాయిల్ తోట దగ్ధమైన ఘటన పినపాక మండల పరిధిలోని జానంపేట గ్రామంలో గురువారం జరిగింది. బాధిత రైతుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన రైతులు అశోక్, సత్యం మూడు ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారు. ప్రమాదవశాత్తు మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగి తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులతోపాటు కొన్ని మొక్కలు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.